క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ప్రతినెలా రెండో శుక్రవారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, కందెపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, ఆవుల కోటయ్య పాల్గొన్నారు.

చెంచుపేటలో వాహన తనిఖీలు



తెనాలిరూరల్: తెనాలి చెంచుపేటలో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. తెనాలి-గుంటూరు మార్గంలో ఉమేశ్‌చంద్ర విగ్రహం సమీపంలో పోలీసులు ద్విచక్రవాహనాలు, ఆటోలు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాటిని గుర్తించి కేసులు నమోదు చేశారు. తనిఖీలలో ఎస్‌ఐలు ప్రకాశరావు, కరీముల్ల, సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సు, సి-బుక్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐలు తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

తెనాలిటౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని అంగన్‌వాడీలకు తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి రమాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి రమాదేవి మాట్లాడుతూ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు రోగనిరోధక శక్తి తగ్గడం వలన క్షయ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని సూచించారు. సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, బయట ఆహార పదార్థాలు తీసుకోకుండా చైతన్యపరచాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సౌజన్య, నాగమణి, కె.యామిని, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి దిశగా ఆదివాసీలు అభివృద్ధి చెందాలి

తెనాలిటౌన్: ఆదివాసీలు విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని డీబీఆర్‌సీ స్టేట్ కోఆర్డినేటర్ హేమలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ అందరిలో సాధికారత రావాలని విద్య, ఉపాధి అవకాశాల్లో చైతన్యం కలగాలని ఆకాంక్షించారు. అందరూ ఆధార్‌కార్డులు తీసుకోవాలని, పిల్లలను అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సీటీ కో-ఆర్డినేటర్ పి.రజని, కమల, విజయకుమారి, హసీల, తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ సహస్రాబ్ది కవి ఆలూరి బైరాగి

- ఆధునికత వైపరీత్యాలపై హెచ్చరించిన తొలి తెలుగు కవి
- హిందీ సాహిత్యంలోనూ ధ్రువతార
- నేడు తెనాలిలో కాంస్య విగ్రహావిష్కరణ



ఆలూరి బైరాగి

తెనాలి: మానవ జీవితంలో ఆధునికత వైపరీత్యాలను తాత్వికంగా వ్యతిరేకించిన తొలి తెలుగు కవి ఆలూరి బైరాగి. ద్వితీయ సహస్రాబ్ది మహాకవిగా అనిపించుకున్న ఆయనకు జన్మస్థలి తెనాలిలో ఇప్పటివరకు సరైన నివాళి లేదు. వచ్చే నెల శత జయంతి సందర్భంగా బైరాగి పుట్టి పెరిగిన స్థానిక అయితానగర్‌లో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అది కూడా బైరాగి సాహిత్యంతో ప్రభావితుడై జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్న ఎంపీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ దాతృత్వంతో ఇచ్చిన కాంస్య విగ్రహమది. అక్కడి లింగారావు సెంటరులో ఉదయం 10 గంటలకు ఏర్పాటయే కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. విగ్రహదాత డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తోపాటు 'అరసం' జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రసిద్ధ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్, ప్రముఖ కవి బండ్ల మాధవరావు పాల్గొంటారు. ఆలూరి బైరాగి శతజయంతి కమిటీ, తెనాలి అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు పర్యవేక్షిస్తారు. 1925 సెప్టెంబరు 5న ఆలూరి బైరాగి జన్మించారు. జాతీయాభిమానంతో తండ్రి వెంకట్రాయుడు హిందీ అక్షరాభ్యాసం చేయించారు. యలమంచిలి వెంకటప్పయ్య నడిపిన హిందీ పాఠశాలలో పదేళ్లకే మధ్యమ పూర్తిచేశాడు. ప్రజానందన శర్మ వద్ద రాష్ట్ర భాష, విశారద పూర్తిచేశాడు. పుస్తక పఠనంపై ఆసక్తితో కనిపించిన పుస్తకాన్నల్లా చదువుతూ వచ్చాడు. 13వ ఏట ముజఫర్‌పూర్ వెళ్లి నాలుగేళ్లు హిందీ, సంస్కృతం నేర్చుకున్నారు. అక్కడే తన 15వ ఏట తొలిసారిగా హిందీ కవిత రాసి, జాతీయ కవి సమ్మేళనంలో ప్రశంసలు పొందారు. 1941లో తిరిగొచ్చారు. తన 17వ ఏట తల్లి సరస్వతి మరణం ఆయన్ను కుంగదీసింది. క్విట్‌ఇండియా ఉద్యమంలో పనిచేశాడు. ఎంఎన్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ నేతలతో పరిచయాలు బైరాగి జీవితంలో కీలక మలుపు. మార్క్సిస్టు తత్వశాస్త్రం, ఎంఎన్ రాయ్ సిద్ధాంతాలు బైరాగిని ఒక విలక్షణమైన దార్శనికగా తీర్చిదిద్దాయి.

ఇరవై ఏళ్లకే తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ భాషల్లో పాండిత్యాన్ని సాధించాడు బైరాగి. 1946లో ప్రత్తిపాడు హైస్కూలులో హిందీ ఉపాధ్యాయుడిగా చేరాడు. తెలుగు కవితా సంకలనం 'చీకటి నీడలు' వెలువరించాడు. సినీ నిర్మాత, పినతండ్రి చక్రపాణి ఆహ్వానంతో చెన్నైలో హిందీ 'చందమామ' సంపాదకుడిగా మరో మజిలీ. అప్పుడే హిందీ కవితా సంకలనం 'పలాయన్' తెచ్చాడు. తెలుగులో రాయని వైయుక్తికమైన ప్రేమ కవిత్వాన్ని ఆయన హిందీలో అద్భుతమైన సౌందర్య దృష్టిలో వెలువరించారు. స్వేచ్ఛాప్రియుడైన బైరాగి, ఆ పత్రిక నుంచి కొద్ది కాలానికే బయటకొచ్చారు. 'నూతిలో గొంతుకలు' కవితా సంకలనంతో మానవ సహజ వేదనకు గాఢమైన అభివ్యక్తిని ఇచ్చాడు. 'దివ్యభవనం' కథాసంపుటిని తీసుకొచ్చాడు.

మహాజలపాతం వంటి పదగుంభనం, అనన్యమైన భావోద్వేగం, అనితరసాధ్యమైన ధారాశుద్ధి కలిగిన బైరాగి, ఎప్పుడూ సమూహంలో ఒంటరిగానే ఉండేవాడు. జీవితాన్ని వివిధ కోణాల్లో చూశాడు. సమాజంలోని పీడిత, తాడిత ప్రజల బాధామయ జీవిత గాథలను తన కవిత్వపు ప్రతి పంక్తిలోనూ జీవింపజేశాడు. తనకంటూ ప్రత్యేకంగా నిర్మించుకున్న సాహితీ జగత్తులోనే నివసించాడు. రెండో ప్రపంచ యుద్ధంలో విపరీతంగా జరిగిన జననష్టంపై స్పందించిన బైరాగిలోని కవి హృదయం, 'ఈ హత్యలకై జవాబు ఏ ద్రోహుల నడగాలో' అంటూ పలికింది.

సమాజంలో ఏ ఒక్క అనాచారమూ, అనర్థమూ ఆయన దృష్టిని తప్పుకోలేదు. అవినీతి, అక్రమాలతో నిండిన ఈ జీవితపు చీకటి నుంచి ఆకాశపు వెలుతురులోకి చొచ్చుకుపోయే విహంగ స్వేచ్ఛ బైరాగి జీవితం. ఆయన కవిత్వమంతటా చీకటి, తుఫాన్, విధ్వంసం, నెత్తురు అలముకున్నాయి. ఆయన వేదన మేధోజనిత వేదన కాదు. ఆ సంక్షోభాన్ని ఆయన అనుభవించారు. ఒక దోస్తావిస్కీ, ఒక కాఫ్కా, ఒక కిర్కేగార్డ్‌లా ఆయనది స్వానుభవ సంవేదన. అసంక్షుభిత గరళాన్ని తాను మింగి కవితామృతాన్ని మనకు పంచాడు. అభివృద్ధి నెపంతో ఆధునికత సృష్టించే వినాశనాన్ని ముందే హెచ్చరించిన కాలజ్ఞుడు ఆయన.

పీడిత జనావళికి ప్రతినిధిగా బైరాగి వెలువరించిన గ్రంథాలు తక్కువే. అవే ఆయన్ను తెలుగు, హిందీ సాహిత్యంలో ధ్రువతారగా నిలిపాయి. ఆయన రాసిన 'ఆగమగీతి' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'చీకటి నీడలు', 'నూతిలో గొంతుకలు' తెలుగు కవితా సంకలనాలు. హిందీ కవితా సంకలనం 'పలాయన్'. తెలుగు కథాసంకలనాలు 'దివ్యభవనం', 'త్రిశంకుస్వర్గం'. తెలుగులో ఆధునిక కవిత, ప్రముఖ ఆధునిక కవితల హిందీ కావ్యానువాదం..ఇంకా అనేక కవితలు ప్రచురితమయ్యాయి.'నాక్కొంచెం నమ్మకమివ్వు' కవిత బాగా పేరు తెచ్చింది. దీనిని శ్రీశ్రీ ఇంగ్లిష్‌లోకి అనువదించారు.

సాహితీ సమాజంలో ఎంతగా ఎదిగినా బైరాగి జీవితాన్ని చాలా నిరాడంబరంగా గడిపారు. కవిత్వం, కథలు, వ్యాసాలతో వచ్చే ఆదాయంతోనే కాలక్షేపం చేశాడు. అతడి ముగ్గురు సోదరులు ఎదిగి వచ్చి, బైరాగి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడినా, ఎందుచేతనో ఒంటరిగానే జీవించాడు. ఆరోగ్యం క్షీణించినా ఆహార నియమాలు పాటించలేదు. 1978 సెప్టెంబరు 9న మరణించాడు.

ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు

తెనాలిటౌన్: శ్రావణమాసం రెండోవ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో మహిళలు ఆలయాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్ల వద్ద వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూరల్ మండలం కఠెవరంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాజర్‌పేటలోని మహాలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ విద్యాపీఠంలో కనులపండువగా అర్ధచాతుర్మాస వ్రత దీక్ష

తెనాలిటౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శుక్రవారం 30వ రోజు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, వరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు కనుల పండువగా నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలాస్వామీజి పాల్గొని అర్ధ చాతుర్మాస వ్రత దీక్ష, హనుమాన్ చాలీసా పారాయణం, వరలక్ష్మి వ్రతం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెనాలి కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్, సాలీగ్రామం మఠం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిజీ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వరలక్ష్మి వ్రతం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సెక్రటరీ రావూరి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, కోశాధికారి జి.రామకృష్ణ, రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో గుంటూరులో సీపీఐ జిల్లా మహాసభలు

తెనాలిఅర్బన్: గుంటూరులో ఈ నెల 17,18 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు తెలిపారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను నాయకులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1925, డిసెంబర్26న సీపీఐ ఆవిర్భావించిందని తెలిపారు. సుమారు 100 సంవత్సరాలు ప్రజల పక్షాన పోరాడిన ఏకైక పార్టీ తమదని చెప్పారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పేద వాడిని అదనంత పెరిగాయని అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు కేంద్రం సిద్ధమైందని విమర్శించారు. పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ ఈనెల 17,18 తేదీల్లో 26వ జిల్లా మహాసభలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గుండు శివ, నియోజకవర్గ కార్యదర్శి తుంగ బాలస్వామి, పార్టీ నాయకులు బొల్లిముంత శివరామకృష్ణ, పరుచూరి వెంకటేశ్వర్లు, రవి, పండు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సింగారావు, కిరణ్ బాబు, తదితరులు

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు

ఏడీఏ మోహనరావు

కొల్లిపర: వ్యాపారస్తులు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏడీఏ మోహనరావు హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అధికారులు ఎరువుల బిల్లు పుస్తకాలు, రికార్డులు, స్టాక్ క్షుణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్స్ అందరూ తమ స్టాకుకు తగ్గట్టు బిల్లులను మెయింటైన్స్ చేయాలని, ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా ఎరువులు అమ్మరాదు, అలా కాకుండా ఎక్కువ ధరకు అమ్మితే అటువంటి వారిపై చర్యలు తీసుకోవటమే కాకుండా వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పురుగుమందులు, కాంప్లెక్స్ ఎరువులకు ఎటువంటి కొరత లేదు కావున రైతులు తమకు కావలసినంత ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి ఎంఏఓ కె.సుధీర్‌బాబు, స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లిపర మండలంలో ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహనరావు

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ శాలిపేటకు చెందిన హారికకు హైదరాబాద్‌కు చెందిన అరవింద్‌తో కొంతకాలం కిందట వివాహమైంది. తనను భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని హారిక పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు శుక్రవారం నమోదు చేశారు.

బతుకుపోరు చిత్రం 'అల్లిక'

- ప్రసిద్ధ రచయిత్రి చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి
- నేడు తెనాలిలో పరిచయ సభ

తెనాలి: సంక్షుభితమైన జీవితాలు, చీకటి బతుకుల్లోని సంకెళ్లను ఛేదించుకుని పోరాటయోధులుగా వెలిగిన అరుదైన స్త్రీల చరిత్రను 'మిణుగురులు'గా రికార్డుచేసిన ప్రముఖ కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి తాజా కవితా సంపుటి 'అల్లిక'. ఇక్కడి కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో శనివారం సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న ఈ పుస్తక పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహిస్తారు. 'అరసం' జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, వివిధ సాహిత్య సంస్థల బాధ్యులు నూకతోటి రవికుమార్, వున్నవ వినయ్ కుమార్, శిఖా ఆకాష్, డాక్టర్ మిరప మాధవి, తంగిరాల సోని పాల్గొంటారు. తాను అనుభవించిందీ, అనుభవానికి వచ్చిందీ రాయలేనితనం నుంచి పుట్టుకొచ్చిన కవితలే 'అల్లిక' కవితా సంపుటిలో చోటుచేసుకున్నాయని స్వరూపరాణి చెబుతారు. ప్రపంచవ్యాప్తంగా రైట్‌వింగ్ ఫాసిస్టు శక్తుల విజృంభణతో అణచివేతకు గురయ్యే సమూహాలు, ముఖ్యంగా నల్లజాతివారు, ఆదివాసులు, మైనారిటీ మతస్తులు, స్త్రీల గొంతుమీద వేటగాడి కత్తి వేలాడుతున్న సందర్భం...కులమత తత్వాలకు కోవిడ్ తోడై పీడిత ప్రజలకు ఊపిరాడకుండా చేయటం, రకరకాలైన అమానవీయతపై స్వరూపరాణి కలం నుంచి గత ఏడేళ్లలో వెలువడిన కవితలివి. గత కవిత్వంకన్నా భిన్నమైన, గాఢమైన, తీవ్రమైన దళిత అభివ్యక్తి ఇందులో ఉంది. సమాజం పట్ల తన దళిత దృష్టి, బహుజన సోయ ఏమాత్రం వన్నె తగ్గకపోగా సరికొత్త నాణ్యతనీ, లోతునీ సంతరించుకున్న కవితా సంవాదం 'అల్లిక'లో నిర్మితమయిందన్న ప్రశంసలు అందుకున్నారు కవయిత్రి. 'స్వరూపరాణి కవిత్వంలో ప్రతి పాదంలో బతుకు భాష మనల్ని పలకరిస్తుంది' అనిపించుకున్నారు. ఆర్కియాలజీ, సామాజిక, సాంస్కృతిక చరిత్ర, ఎత్నో ఆర్కియాలజీ, జెండర్ స్టడీస్, రెలిజియస్ స్టడీస్‌లు స్వరూపరాణి పరిశోధనా రంగాలు. మూడు కవితా సంపుటాలు వెలువరించారు. ఇందులో ఒకటి ఇంగ్లిష్. 'మంకెనపువ్వు' కవితా సంపుటి తెలుగు కవిత్వంలో మంచి గుర్తింపును పొందటమే కాదు..స్వరూపరాణిని ఆధునిక కాలంలో తొలి దళిత కవయిత్రిగా సాహిత్య విమర్శకులు గుర్తించారు. ఈ పుస్తకంలోని కవితలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. 'స్టాలిన్ గ్రాడ్లో దళిత పులులు' పేరున తొలి తరం దళిత కమ్యూనిస్టుల చరిత్రను వెలికితీశారు. రెండు వ్యాస సంపుటాలు, అయిదు సిద్ధాంత గ్రంథాలు ప్రచురించారు. వీరి రచనలు ఇంటర్ నుంచి పీజీ వరకు పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. వృత్తి, వ్యావృత్తుల్లో భాగంగా వందలాది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో ప్రసంగాలు చేశారు. వందకు పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ బెస్ట్ రీసెర్చర్ అవార్డును ఇచ్చారు. వీరి వద్ద 60 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ చేశారు. వీరిలో ఎక్కువమంది బర్మా, థాయ్‌లాండ్, వియత్నాం, భూటాన్‌కు చెందిన వారు. తన కృషికి గుర్తింపుగా 13 అవార్డులు స్వీకరించారు.



ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



'అల్లిక' కవితా సంపుటి

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ ఏరియా గాడిబావి సెంటర్‌లోని శ్రీ సీతారామాంజనేయస్వామి వారి దేవస్థానం తాలూకు నూతన ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవి.అమర్‌నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ దేవాదాయ, ధర్మదాయశాఖ విజయవాడ ఉత్తర్వులు మేరకు 20 రోజుల లోపు తెనాలి పట్టణ ప్రజలు, భక్తులు ధర్మకర్తల మండలి నియమకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైఖానస ఆగమవిద్యలో దిట్ట రంగాచార్యులు



దీవి బాలాజీ రంగాచార్యులు

తెనాలి: శ్రీవైఖానస సేవాసంఘం, తెనాలి ఆధ్వర్యంలో శనివారం శ్రీవిఖనాసాచార్య స్వామి 66వ వర్ష వర్ధనోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణ నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధనస్వామి దేవాలయంలో జరిగే వేడుకల్లో టీటీడీ సర్కార్-శ్రీనివాస మంగాపురం ప్రధాన అర్చకుడు, ప్రసిద్ధ ఆగమ పండితుడు శ్రీమాన్ దీవి బాలాజీ రంగాచార్యులుకు ఆగమ పండిత సత్కారంతోపాటు 'వైఖానస ఆగమధురీణ' బిరుదును ప్రదానం చేయనున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఆగమ పండితుడు దీవి బాలాజీ రంగాచార్యులు పరిచయమిది. ఆగమ అధ్యాపక అధ్యాపకునిగా, విద్యావేత్తగా శిష్యరత్నాలను తీర్చిదిద్ది, ప్రస్తుతం అర్చక విధులతోపాటు ప్రతిష్ఠా కైంకర్యాలు, భగవత్ శాస్త్రంలోని యజ్ఞయాగాది క్రతువులను జరిపిస్తున్న దీవి బాలాజీ రంగాచార్యులు స్వస్థలం గుంటూరు దగ్గర్లోని పాతూరు. 1984 నవంబరు 16న జన్మించారు. తలిదండ్రులు దీవి సత్యనారాయణాచార్యులు, జయలక్ష్మి. గుంటూరులో పదోతరగతి, అంబేడ్కర్ యూనివర్శిటీలో బీకాం చేసిన బాలాజీ రంగాచార్యులు, ద్వారకా తిరుమలలో అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు వద్ద ఆగమ విద్యాభ్యాసం చేశారు. తెనాలి, కొలకలూరులో దీవి హనుమంతాచార్య స్వామి వద్ద ప్రతిష్ఠాంతము వరకు చదివారు. ఆగమ విద్యలో ప్రవేశ, పర, ప్రవర చదివారు. తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వభాగ బంగారు పతకాన్ని అందుకున్నారు. దేవాదాయశాఖ నిర్వహించే పరీక్షలకు అధికారిగానూ చేశారు. 2005-08 వరకు శ్రీఅండవన్ వేద పాఠశాలలో శ్రీవైఖానస ఆగమ అర్చకుడిగా, 2005 నుంచి టీటీడీ దేవస్థానం సర్కార్ అర్చకునిగా శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కైంకర్యం చేస్తున్నారు. అర్చక విధులతో పాటు ప్రతిష్ఠా కైంకర్యాలు, యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణలోనూ పేరుతెచ్చుకున్నారు. 2022లో పెనుమాకలో ఒకేసారి 108 దేవాలయాల ప్రతిష్ఠాపనను నిర్వహించారు. 2023లో 150 మంది ఋత్వికులతో అష్టోత్తర శత కుండాత్మక హవనంలో పాల్గొన్నారు. ఆగమవిద్యలో పాండిత్యానికి గాను బాలాజీ రంగాచార్యులు పలు గౌరవాలనూ అందుకున్నారు.



మారీసుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారికి శ్రీవరలక్ష్మీదేవి అలంకారం



తెనాలి కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవి ఆలయంలో శ్రీవరలక్ష్మీదేవిగా అమ్మవారు



శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దర్శనం కోసం క్యూలో మహిళా భక్తులు

ఆంధ్రాప్యారిస్‌లో వరలక్ష్మి కళ

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు భక్తివిశ్వాసాలతో జరుపుకున్నారు. దేవాలయాల్లో అమ్మవారికి వరలక్ష్మి అలంకారం చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. వరలక్ష్మి వత్రం మంగళకరమని భక్తుల విశ్వాసం. ఆలయ ప్రాంగణాల్లో అమ్మవారి వ్రతం చేసుకున్నారు. ఇళ్లలోనూ వ్రతం ఆచరించిన వారెందరో ఉన్నారు. నూతన వస్త్రాలను ధరించి, పూజలను నిర్వహించి, పొంగలి, పిండివంటలతో ఆనందంగా గడిపారు. - తెనాలి



తెనాలిలోని శ్రీవాసవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం



వ్రతాలు చేస్తున్న మహిళలు

నేడు కాకతీయ సహకార సొసైటీ సర్వసభ్య సమావేశం

తెనాలి: ది కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి 24వ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో జరగనుంది. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ డీఎల్ కాంతారావు వివరాలు తెలియజేశారు. మహాజనసభలో 2024-25 సంవత్సర జమాఖర్చులు ప్రవేశపెడతామని తెలిపారు. సొసైటీ రూ.215 కోట్ల పెట్టుబడితో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేసినట్టు చెప్పారు. మార్ట్‌గేజ్ రుణాలు, బంగారు ఆభరణాల రుణాలతో సేవలనందిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్లు షేక్ ఖలీల్, చక్రధర్, సుబ్రమణ్యశాస్త్రి, కఠారి వాసుదేవనాయుడు, సీఈవో ఝాన్సీలక్ష్మి ఉన్నారు.

- నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం తెనాలి పట్టణ, రూరల్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని కోరారు.